## సింగిల్ పేజీ కథలు

# నమ్మకం

ముకుందంలో అపరాధ భావన క్రమంగా పెరగసాగింది. తానేదో ఘోరమైన తప్పిదం చేయటం వల్లే ఇలాంటి పరిస్థితి ఎదురైందని అతనికి అన్పించింది.

గత నాలుగు రోజుల్లో కొన్ని వందల సార్లు ఆ సంఘటనను నెమరువేసుకున్నాడు.

ఇష్టదైవాన్ని నమ్ముకుని పుణ్యక్షేత్రానికి వెడితే..బ్యాగు మాయం కావటం.. అందులో ఉన్న డబ్బులు..రిజర్వేషన్ టిక్కెట్లు.. మొబైల్ ఫోన్ కోల్పోటం.

చివరికి నానా అవస్థలు పడి..తీర్థయాత్రలు అర్థాంతరంగా ముగించుకుని తిరిగి రావటం ముకుందానికి మింగుడు పడలేదు.

ఏ రైల్లోనో, బస్సులోనో వస్తువులు చోరుల పాలయితే ఫరవాలేదుగానీ తాను నమ్ముకున్న దేవుడి గుడి ప్రాంగణంలోనే ఇలా కావటమేమిటి? అనేది ప్రశ్న.

''నీ చాదస్తం వల్లే ఇలాంటి పరిస్థితులొచ్చాయి. రోజూ మమ్మల్ని చంపుతున్నది చాలక, పెళ్లాం పిల్లల్ని తీర్థయాత్రలకి తీసికెళ్లి, నానా ఇబ్బందులు పెట్టావన్నమాట.''

మొహం మీదే అనేశారు కొలీగ్స్. అతని దినచర్య తెలిసిన వాళ్లకి, అతనిపై సానుభూతి కలగకపోగా, ఒళ్లుమండింది. ముకుందం ఆఫీసుకు వస్తూనే సొరుగులో ఉన్న దేవుడి పటాన్ని టేబుల్‌పైన ఉంచుతాడు. పది నిమిషాలపాటు ప్రార్థన చేస్తాడు. ఆ తర్వాత హారతి వెలిగించి పక్కనున్న వాళ్లందరినీ కళ్లకద్దుకోమంటాడు. బాస్ ఏదైనా పనికోసం గదిలోపలికి పిలిచినా, ఒకసారి దణ్ణం పెట్టుకుని గానీ వెళ్లడు. ఫైల్స్ చూస్తున్నప్పుడు అతని పెదవులు జపం చేస్తూ ఉండటం పక్కనున్న వాళ్లందరికీ పరిచయమే.

అందరి దృష్టిలో అతనో 'విచిత్రజీవి'. పొట్టిగా సోడాబుడ్డి కళ్లద్దాలు...నుదుట విభూది..ఆకారం అదో రకంగా ఉండటమే కాదు..వ్యవహార శైలి కూడా చిత్రంగా ఉండేది.

స్నేహితులెవరినీ తనింటికి ఆహ్వానించేవాడు కాదు. ఎవరైనా అతన్ని రమ్మని పిలిస్తే...''ఈరోజు ఉపవాసం..ఇంట్లో ప్రత్యేక పూజలున్నాయి'' అని తప్పించుకునేవాడు. 'టీ' తాగటానికే కలవని అతన్ని మందు పార్టీలకి పిలవటానికి ఎవరూ సాహసించేవారు కాదు. కొలీగ్స్‌తో కూడా అతను కలుపుగోలుగా మాట్లాడే సందర్భాలు అరుదుగా ఉండేవి. ఆడవాళ్ళు అతను ఎదురుపడగానే...'మనకెందుకొచ్చింది' అన్నట్టు పక్కకు తొలగిపోయేవారు.

ఇలాంటి వాతావరణంలో...

తనకొచ్చిన కష్టం ఎవరితో పంచుకోవాలో ముకుందానికి తెలియలేదు. ''తాగుబోతులు..తిరుగుబోతులు...పెళ్ళాం పిల్లలతో జల్సా చేస్తుంటే..నాకు మాత్రం ఈ క(న)ష్టాలు మిగిలాయి'' భారంగా నిట్టూర్చాడు.

''ఏవోయ్! ముకుందం...? పూజలు పునస్కారాలు లేవా? రెండ్రోజుల నుంచి చూస్తున్నా. రాగానే ఫైల్ తీసి చకచకా పనిచేసుకుపోతున్నావ్?''

ఎదురు సీట్లో ఉండే మల్లేశం నిలదీశాడు.

ఏం చెబుతాను? దేవుణ్ణి నమ్మి మోసపోయాను. ఇక ముందు ప్రార్థనలు చెయ్యనని చెబితే..

మల్లేశం వెటకారంగా మరో నాలుగు మాటలు విసురుతాడు. 'ఎందుకొచ్చిన పీడ.. నవ్వి ఊరుకుంటేపోలా..' అనుకుని. వినీవిననట్టుగా తల పంకించాడు ముకుందం. ఆ తర్వాత...తన వెనకా, ముందూ కూడా సహచరులు చులకనగా మాట్లాడటం అతని చెవిని పడుతూనే ఉంది. బయటకు మామూలుగా కనిపిస్తున్నా, అతని మనసును తొలిచేస్తున్న వేదన మాత్రం తగ్గలేదు.

రోజులు గడుస్తున్నాయ్. నిర్లిప్తంగా పనిచేసుకుపోతున్నాడు.

పూజ దాదాపుగా మానేశాడు.

ఆరోజు..

పోస్టులో అతని పేరుతో ఉత్తరం.

ఐదేళ్ల క్రితం..ఇన్‌కంటాక్స్ నిమిత్తం.. ఓ పేరున్న కంపెనీలో షేర్ల కోసం పెట్టుబడి పెడితే...

ఇన్నాళ్లకు...ఆ కంపెనీ షేర్లను వేరే వాటిలో విలీనం చేశామని చెబుతూ..

పెద్దమొత్తంలో సొమ్ము డి.డి. పంపుతున్నట్లు సారాంశం. ముకుందం నమ్మలేకపోయాడు.

'తను కోల్పోయిన సొమ్ముకు మూడు రెట్లు మొత్తం తన చేతిలో పడబోతోంది. ఇష్టదైవం తనను మోసగించాడనుకున్నాను కాని ఇలా కరుణిస్తాడని ఊహించలేకపోయాను నేనెంతో అదృష్టవంతుణ్ణి' అనుకున్నాడు ఆ క్షణాన.

'తనది మూఢభక్తి అని ఎగతాళి చేసిన వారికి 'నిదర్శనంగా' ఈ సంఘటనని చెప్పవచ్చేమో!' అని కూడా అనిపించింది.

'నమ్మకం ఉంటే...పోయిన సొమ్ముకు అంతకంతా తిరిగి దక్కుతుంది' ఎవరో స్నేహితులు చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. కొన్నాళ్లుగా మనసులో గూడుకట్టుకున్న వేదన-

ఎవరో చెయ్యి పెట్టి లాగేసినట్టు..మాయమైంది.

మరుసటి రోజు ఉదయం..

ఎప్పటి మాదిరిగా..

టేబుల్‌పైన దేవుడి పటం వుంది.

అగరవత్తులతో హారతి ఇస్తున్న ముకుందాన్ని చూసి విస్తుపోయారు స్టాఫంతా.

**-శ్రీసాయి పల్లవి (అనంతపురం)**

### పులికంటి సాహితీ సత్కృతి సంక్రాంతి కథల పోటీ

**సంక్రాంతి పండుగ సందర్భాన్ని పురస్కరించుకొని 'పులికంటి సాహితీ సత్కృతి' యథావిధిగా కథల పోటీ నిర్వహిస్తున్నది. సాహితీ సత్కృతి తెలుగు కథకు చేస్తున్న ఉడుతాభక్తి సేవను సహృదయంతో గ్రహించి ఈ పోటీలో రచయితలు, రచయిత్రులు పాల్గొని విజయవంతం చేయాలని సంస్థ అధ్యక్షులు పులికంటి కృష్ణారెడ్డి కోరుతున్నారు.**

నిబంధనలు:

★ వయోపరిమితితో నిమిత్తం లేకుండా, ప్రాంతీయ ప్రసక్తి లేకుండా తెలుగు రచయిత, రచయిత్రులందరు పాల్గొనవచ్చును.

★ కథ 12 అరఠావులకు మించకుండా వుండాలి. కథను కాగితానికి ఒకవైపే చదవగలిగిన రీతిలో రాయాలి.

★ ఇతివృత్తం ఏదైనా కావచ్చు- కాని సామాజిక ప్రయోజనం విధిగా దృష్టిలో పెట్టుకోవాలి.

★ బహుమతుల నిర్ణయంలో సాహితీ సత్కృతి కార్యవర్గ నిర్ణయమే తుదినిర్ణయం. దీనిమీద ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు.

★ పోటీకి అర్హంకాని కథలను తిప్పి పంపడానికి తగినంత పోస్టేజితో విధిగా కవరును జతపరచాలి.

★ పోటీలో బహుమతులు అందుకొన్న కథలతో మరికొన్ని ఉత్తమ కథలు కలిపి సాహితీ సత్కృతి సంపుటీకరించే ప్రయత్నమే కాకుండా పత్రికాముఖంగా కూడా ప్రచురించే ప్రయత్నం చేస్తుంది.

★ 2005 జూలై నెలలో తిరుపతిలో నిర్వహించే పులికంటి సాహితీ సత్కృతి బహుమతి ప్రదాన సభలో విజేతలను సముచితరీతిని సత్కరించి జ్ఞాపికతో పాటు బహుమతి మొత్తాన్ని అందజేస్తుంది.

మొదటి బహుమతి - రూ.4000/- రెండవ బహుమతి - రూ.3000/-

మూడవ బహుమతి - రూ.2000/- రెండు ప్రత్యేక బహుమతులు ఒక్కొక్క కథకు - రూ.500/-

**పోటీ కథలు సాహితీ సత్కృతికి అందవలసిన ఆఖరు తేదీ: 31-1-2005.**

పోటీ కథలు పంపవలసిన అడ్రసు:

పులికంటి సాహితీ సత్కృతి, విశ్వంభర, 12-4-467, బండ్ల స్ట్రీట్, తిరుపతి-517 501.